సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



ఎర్రవరంలో హీరో శ్రీకాంత్ పూజలు

ఎర్రవరంలోని శ్రీబాల నరసింహస్వామి ఆలయాన్ని గురువారం సినీహీరో శ్రీకాంత్ దంపతులు దర్శించుకున్నారు.

- 8లో



యాదాద్రిలో హరినామ సంకీర్తన

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రిలో గురువారం హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- 8లో



నీటిని విడుదల చేయాలి

సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి కోరారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట): ప్రభుత్వ రంగంలోకి ఆర్టీసీ విలీన బిల్లు ప్రక్రియను వేగవంతం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట డిపోలో సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన విలీన కమిటీకి ఇచ్చిన మెమోరాండం కాపీలను డిపోలో కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు గుండు రమేష్, ఉప్పు లక్ష్మయ్య, విప్లవరెడ్డి, టీబీ.రావు, నాగమల్లు, సురేష్, ఆశీర్వాదం, సైదులు, ముస్తాఫా, ఎంఎస్.రావు, శ్రావణ్ కుమార్ మంజుల, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు డీఈసీ మాత్రలు అందించాలి



సిరికొండలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి అనురాధ

మోతె: ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఫైలేరియా నివారణకు డీఈసీ మాత్రలతోపాటు నట్టల నివారణ మందులు అందించాలని కేంద్ర లెప్రసీ కేస్ డిక్సేషన్ కంప్యారీ (ఎల్‌సీడీసీ) తెలంగాణ రీజినల్ అధికారి డాక్టర్ అనురాధ అన్నారు. గురువారం మండలంలో సిరికొండ (ఆరోగ్య ఉప కేంద్రం) పల్లె దవాఖానాను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న నట్టల నివారణ, కుష్టువ్యాధి నివారణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సాహితీ, రాజశేఖర్, నాజియా, నాగరాజు, పీహెచ్‌ఎన్ సీత, సూపర్‌వైజ్ కమలమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయండి



రెండో ఏఎన్‌ఎంల సమ్మెలో మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కరోనా సమయంలో ప్రాణాలొడ్డి విధులు నిర్వహించిన రెండో ఏఎన్‌ఎంల సేవలను ప్రభుత్వం మరిచిపోవడం బాధాకరమని, వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో కాంట్రాక్టు పద్ధతిన విధుల నిర్వహిస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని కోరుతూ సూర్యాపేటలోని కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు లక్ష్మీబాయి, స్వప్న, గోపమ్మ, రాధాకు మారి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, ఆ సంఘం జిల్లా నాయకుడు లతీఫ్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లానుంచి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.మల్లేష్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి నిత్యం సాధన ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించవచ్చన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20న గోల్కొండలో జరగబోయే 2వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, వెంకటేష్, పరమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'వంద'కు స్థలం కొరత



కోదాడలోని ప్రభుత్వ వైద్యశాల



వైద్యశాల స్థలం ఆక్రమణకు గురైందని 23-04-2018న సాక్షి ప్రచురించిన కథనం

కోదాడలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సరిపడాలేని భూమి

- ఇటీవలే వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఆక్రమణకు గురైన ఆస్పత్రి స్థలం
- ఈ విషయాన్ని గతంలోనే వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- ఆక్రమణలను తొలగిస్తేనే సాధ్యమంటున్న పట్టణవాసులు

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాలను 30 నుంచి 100 పడకలుగా మారుస్తూ.. నూతన భవన నిర్మాణానికి రూ.26 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేసిన విషయం విదితమే. ఈ ప్రకటన పట్టణ ప్రజలకు ఆనందం కలిగిస్తున్నా.. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి కావాల్సిన స్థలం ఆక్రమణకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఆక్రమణలు తొలగిస్తే ప్రస్తుతం ఉన్న 30 పడకల వైద్యశాలను అలాగే ఉంచి కొత్త భవనాన్ని నిర్మించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఆక్రమణలు తొలగించకపోతే, ప్రస్తుతం ఉన్న వైద్యశాలను కూలగొడితేకాని వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరిగే పరిస్థితి లేదు.

అస్తవ్యస్తంగా నిర్మాణాలు

కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఇరవై ఏళ్ల క్రితం సోఫార్ అనే స్వచ్ఛంద సంస్థ వాటర్ ట్యాంక్‌ను గ్రామ పంచాయతీ కోసం నిర్మించింది. నాటి నేటి వరకు దానిని ఉపయోగించకుండా వదిలేశారు. ఇక.. ఇదే ఆవరణలో రిలయన్స్ సంస్థ సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ఇక ఇక్కడ చెట్టు కింద ఉన్న ముత్యాలమ్మ గుడి కోసం వందల గజాల్లో నిర్మాణాలు చేశారు. ఇదే ఆవరణలో పీహెచ్‌సీ కోసం నలభై ఏళ్ల క్రితం నిర్మించిన భవనంతో పాటు గతంలో ఆపరేషన్ల కోసం ఉపయోగించే భవనం, వైద్యుడి క్వార్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా వీటిని అలాగే ఉంచారు. ఇటీవల పేషంట్ల సహాయకుల కోసమంటూ వైద్యశాల ఆవరణ మధ్యలో ఒక షెడ్డును, మరోపక్క ఆక్సిజన్ ప్లాంట్‌ను అడ్డంగా నిర్మాణం చేశారు. ఈ నిర్మాణాలన్నీ అస్తవ్యస్తంగా ఉండడంతో వైద్యశాల ఇరుకుగా మారి కనీసం రోగులు తిరగడానికి కూడా వీలు లేకుండా పోయింది.

రెండెకరాలకు 10 గుంటలు తక్కువే..

వైద్యశాల కాంపౌండ్ లోపల రెండెకరాలకు 10 గుంటల స్థలం తక్కువగా ఉందని, అధికారులు రోడ్లను కలిపి కొలిచి వైద్యశాల స్థలాన్ని దాత వారసుడికి అడ్డదారిలో అప్పగించారని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మరోసారి కలెక్టర్ సర్వే చేసి మొదటిసారి చేసిన కేటాయింపును రద్దు చేశారు. అయితే 2009లో కలెక్టర్ సెలవులో ఉన్న సమయంలో దాత వారసుడు ఆ స్థలాన్ని రాబట్టుకున్నాడు. వైద్యశాలకు తూర్పు, పడమర వైపున ఉన్న గ్రామ పంచాయతీ రోడ్లు వైద్యశాలకే చెందుతాయి. కానీ, మున్సిపాలిటీ అధికారులు సబ్‌కోర్టు ఆర్డర్ ప్రకారం అవి తమ రోడ్లే అంటున్నారు. మరీ వైద్యశాలలో ఉండాల్సిన రెండెకరాల్లో 10 గుంటలు ఎటు పోయిందనే విషయాన్ని అధికారులు తేల్చకుండా వదిలేశారు. దీంతో ప్రస్తుతం మంజూరైన వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

ఆ స్థలాన్ని రాబట్టాలి



కోదాడ ప్రభుత్వ వైద్యశాల కాంపౌడ్ లోపల రెండెకరాలకు 10 గుంటల స్థలం తక్కువ ఉందని ఇరవై ఏళ్లుగా పోరాడుతున్నాం. ఒక్కసారి సర్వే చేస్తే రెండెకరాలకు ఎక్కువ, మరోసారి తక్కువ వస్తుంది. అధికారులు స్పందించి దాత వారసుడికి కేటాయించిన 500 గజాల స్థలాన్ని రాబట్టాలి.

– కుదరవల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

అధిక స్థలం పేరుతో ఆక్రమణ

ఈ వైద్యశాలకు 1963లో నాగుబండ పద్మయ్య రెండు ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. దీనిలో 1964లో లేఅవుట్ చేసి డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ వారి అనుమతితో పీహెచ్‌సీ నిర్మించారు. ఆ తరువాత 2005లో దీన్ని 30 పడకల వైద్యశాలగా మార్చి కొత్త భవనం నిర్మించారు. ఇదిలా ఉండగా దాత వారసుడు వైద్యశాల స్థలంలో తమ తాత దానమిచ్చిన దానికన్నా ఎక్కువ భూమి ఉన్నదని హైకోర్టుకు వెళ్లాడు. దీంతో కోర్టు ఎక్కువ స్థలం ఉంటే ఇవ్వమని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చింది. దీంతో సర్వే అధికారులు లే అవుట్ చేసిన రోడ్లతో పాటు జాతీయ రహదారిని కూడా కలిపి కొలిచి రెండు ఎకరాల కన్నా 500 గజాలు ఎక్కువగా ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. దాని ప్రకారం 500 గజాలు దాత వారసుడికి ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



సభాస్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్

- సీఎం సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
- కలెక్టర్, ఎస్పీ, అధికారులతో సమీక్ష

సూర్యాపేట: ఈ నెల 20న సూర్యాపేటలో జరగబోయే సీఎం సభ వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశించారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్న మెడికల్ కాలేజ్, ఎస్పీ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్, సమీకృత మార్కెట్ భవనాలు సభ ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుందరీకరణ పనులను శుక్రవారం లోగా పూర్తి చేయాలన్నారు. సభా ప్రాంగణం వద్ద తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ ఉన్నారు.

సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కిషోర్, బాలమల్లు

సూర్యాపేటలో ఈనెల 20న జరగనున్న సీఎం సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గురువారం సాయంత్రం తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, టీఎస్ఐఎస్‌సీ చైర్మన్ బాలమల్లు పరిశీలించారు. వివిధ ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

మంత్రికి గోపాల మిత్రల వినతి

భానుపురి (సూర్యాపేట): సీనియారిటీ ప్రాతిపదికన పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో తమను నియమించాలని గోపాల మిత్రుల కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి సూర్యాపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్రుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హత కలిగిన గోపాల మిత్రులకు వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షలు 50 శాతం మార్కులను వెయిటేజీ కల్పించాలన్నారు. అలాగే విధి నిర్వహణలో చనిపోయిన వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాద బీమా రూ.6 లక్షలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అల్దాసు లింగయ్య గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న చెరుకు శ్రీనివాస్, తదితరులు

మున్సిపాలిటీల అభివృద్ధికి ఊతం

- ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు వాటికే కేటాయించాలని నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేక ఖాతాలో జమకానున్న సొమ్ము
- వివిధ పనులకు వినియోగించుకునే వెసులుబాటు



హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని భవనాలు

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. దీంట్లో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) కింద జమ అయ్యే డబ్బులను నేరుగా ఆయా మున్సిపాలిటీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు వినియోగించుకునేలా వాటికే కేటాయించాలని నిర్ణయించింది. దీనికోసం బ్యాంకు ఖాతాలను తెరవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో మున్సిపల్ అధికారులు బ్యాంకు ఖాతాలు తెరిచే పనిలో పడ్డారు. ఇక నుంచి ఎల్‌ఆర్‌ఎస్ కింద చెల్లించే రుసుములు కూడా సదరు బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.

గతంలోనే దరఖాస్తుల స్వీకరణ..

మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2020లోనే ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించింది. వ్యక్తిగతంగా ఒక ప్లాటు దరఖాస్తుకు రూ.1,000లు, లే అవుట్ ఉంటే అన్ని ప్లాట్లకు రూ.10 వేలను చలానా రూపంలో సంబంధిత వ్యక్తులు చెల్లించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోని దరఖాస్తు రుసుములు హైదరాబాద్‌లోని ప్రత్యేక పూలింగ్ అకౌంట్‌లో జమ అయ్యాయి. క్రమబద్ధీకరణకు వసూలు చేసిన రుసుము సైతం ఆ ఖాతాలోనే జమ కావడంతో అవీ ప్రభుత్వానికే చెందుతాయని అంతా భావించారు. ఆ నిధులు మున్సిపాలిటీల అభివృద్ధికి విడుదల చేస్తారోలేదో అనే అనుమానాలు ఉండేవి. తాజాగా ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలతో ఎల్‌ఆర్‌ఎస్ నిధులు స్థానికంగా ఖర్చు చేసేందుకు అవకాశం లభించింది.

మార్కెట్ ధరను బట్టి..

ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో ఉన్న మార్కెట్ ధరలను బట్టి రుసుములు వసూలు చేయనున్నారు. ఒక్కో ప్లాటుకు అక్కడ ఏరియాలో ఉన్న మార్కెట్ విలువను బట్టి సుమారు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీని ప్రకారం మున్సిపాలిటీలకు భారీగానే ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆయా మున్సిపాలిటీల్లో స్వీకరించిన దరఖాస్తుల రూపంలో తక్కువ మొత్తంలో నిధులు సమకూరినా ప్లాట్ల క్రమబద్ధీకరణ ద్వారా రూ.కోట్లలో ఆదాయం సమకూరనుంది.

ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచాం

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు మరింత అభివృద్ధి చెందే వీలుంది. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చే డబ్బులు జమ చేయడానికి ఇప్పటికే ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరిచాం. ఈ నిధులతో మున్సిపాలిటీలో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టొచ్చు.

– నిలిగొండ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రానున్న ఆదాయం అంచనా (ఆయా చోట్ల భూమి విలువను బట్టి)

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఆదాయం(రూ.కోట్లలో..)
సూర్యాపేట	34,475	100.00
కోదాడ	16,746	59.00
హుజూర్‌నగర్	3,689	9.00
నేరేడుచర్ల	3,118	8.50
తిరుమలగిరి	6,000	13.00

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట పర్యటన సందర్భంగా తమకు కేటాయించిన విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ.వెంకట్‌రెడ్డితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హెలిప్యాడ్‌ను కోదాడ ఆర్డీఓ, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి అలాగే ఇతర శాఖల మహిళా ఉన్నతాధికారులకు సంబంధించి వ్యవహారాలను డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, పట్టణాల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రారంభోత్సవాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా, అలాగే సౌండ్‌ప్రూఫ్ జనరేటర్లు అందుబాటులో ఉండేలా విద్యుత్ శాఖ ఏడీలను నియమించాలని సూచించారు. వివిధ ప్రారంభోత్సవాలు, విభాగాలకు నియమించిన అధికారులు ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా చూసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశం జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

- కలెక్టర్ వెంకట్రావు
- కారుణ్య నియామక అభ్యర్థులకు డ్రా పద్ధతిన శాఖల కేటాయింపు



డ్రా పద్ధతిన శాఖలు కేటాయిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ ఉద్యోగులంతా విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన శాఖల కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులకు శాఖల కేటాయింపు పారదర్శకంగా ఉండడం కోసమే లాటరీ పద్ధతిని చేపట్టామని తెలిపారు. 34 అభ్యర్థులకు గాను 32 మందికి శాఖలు కేటాయించామని, అర్హతను బట్టి 30 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్లుగా ఎంపిక చేశామన్నారు. శాఖల కేటాయించిన అభ్యర్థులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సీహెచ్.ప్రియాంక, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ సినిమాను వీక్షించండి

జిల్లా వ్యాప్తంగా పది థియేటర్లలో ఈ నెల 24 వరకు ఉచితంగా ప్రదర్శించనున్న జాతిపిత మహాత్మాగాంధీ సినిమాను విద్యార్థులు తప్పకుండా చూడాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజులుగా ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శించబడుతోందని తెలిపారు. నాలుగో రోజు గురువారం సూర్యాపేట అలంకార్ థియేటర్‌లో 225 మంది విద్యార్థులు, నవ్యలో 350 మంది, తేజ మూవీ మాక్స్‌లో 280, కోదాడ రంగా థియేటర్‌లో 100, సాయికృష్ణాలో 400, శ్రీ వెంకటేశ్వరలో 455, శ్రీనివాసలో 322, నేరేడుచర్లలోని వెంకటరామలో 315, హుజూర్‌నగర్ శ్రీనివాసలో 325, తిరుమలగిరి మల్లీశ్వరి థియేటర్‌లో 150 మందితో కలిపి మొత్తం 2,922 మంది విద్యార్థులు సినిమాను వీక్షించారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మఠంపల్లి : పెదవీడులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

మఠంపల్లి, గరిడేపల్లి: ఎన్నికల కోడ్ రాకముందే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం మఠంపల్లి మండలం పెదవీడు జెడ్పీహెచ్ఎస్‌లో, గరిడేపల్లిలో చేపట్టిన ఆ సంఘం సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వర్‌రావు మాట్లాడారు. కార్యక్రమాల్లో నేలపట్ల సత్యనారాయణగౌడ్, పవన్‌కుమార్, కాశీనాథ్, వెంకటేశ్వర్లు, కీత శ్రీనివాసరావు, రాజేష్, పాలూరి అంజయ్య, నాగరాజు, కేవీ సత్యనారాయణ, రాంబాబు, భిక్షం, గోవిందయ్య, సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్రీడా కిట్లు వచ్చేశాయ్!

- 698 క్రీడా ప్రాంగణాలకు మంజూరు
- ఇప్పటికే మండలాలకు చేరుతున్న సామగ్రి
- మరో మూడు రోజుల్లో గ్రామాల్లో పంపిణీ



జాజిరెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన క్రీడా సామగ్రి కిట్లు

తిరుమలగిరి (తుంగతుర్తి): తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు కేసీఆర్ కిట్ల పేరిట క్రీడా పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఏడాది క్రితం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా ఆటలు ఆడేందుకు పరికరాలు లేకపోవడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 698 క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా రెండు రోజులుగా మున్సిపల్ కేంద్రాలు, మండల పరిషత్ కార్యాలయాలకు క్రీడా కిట్లు చేరుతున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో రానున్న ఈ కిట్లను తెలంగాణ క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పంపిణీ చేయనున్నారు. పరికరాలతో పాటు ఆటగాళ్లకు టీషర్టులు కూడా అందించనున్నారు.


కేంద్రానికి ఒకటి చొప్పున..

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు వాలీబాల్ నెట్లు మాత్రమే సరఫరా చేశారు. ఇప్పుడు తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి కిట్లను పంపిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల పర్యవేక్షణలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేస్తారు. కిట్లు వస్తే ఉదయం, సాయంత్రం సాధన చేయడానికి అవకాశం ఉంటుందని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని చోట్ల వసతుల్లేక..

కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలకు స్థలాలు లేక పోవడంతో పార్కులు, పాఠశాలలు, వసతి గృహాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. కొన్ని ఊరికి దూరంగా ఉన్నాయి. ఇలాంటి చోట్ల ఆటలు ఆడేందుకు యువత పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మరికొన్ని చోట్ల మౌలిక వసతులు కల్పిస్తే యువతకు క్రీడలు ఆడేందుకు అవకాశం ఉండనుంది.

నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తాం



గ్రామాలు, మున్సిపాలిటీల్లో క్రీడా ప్రాంగణాలకు నిబంధనల ప్రకారం క్రీడా పరికరాలు పంపిణీ చేస్తాం. ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాలకు కిట్లను పంపించాం. రెండు, మూడు రోజుల్లో అన్ని గ్రామాలకు చేరవేసి పంపిణీ చేస్తాం.

– వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి

అందించనున్న ఆట పరికరాలు ఇవే..

క్రికెట్ : రెండు బ్యాట్లు, రెండు జతల బ్యాటింగ్ గ్లౌజ్‌లు, లెగ్ ప్యాడ్లు, గార్డ్స్, వికెట్ కీపింగ్ గ్లౌజ్‌లు, వికెట్ కీపింగ్ ప్యాడ్లు, ఆరు ప్రాక్టీస్ బాళ్లు, వికెట్ల సెట్, జిమ్ పరికరాలు, డంబెల్స్ 2, 5.5, 7.5 కేజీలు వేర్వేరుగా అందిస్తారు.

వాలీబాల్: సింథటిక్ నెట్, సైకిల్ పంపు, ఫ్యాడు, బ్యాగు, డిస్కస్‌త్రోలు, ఆరు టెన్నికా యిట్‌రింగులు, 4 స్కిప్పింగ్‌లు, రోబ్‌లు, 3 ప్లాస్టిక్ విజిల్స్, టాప్ అండ్ గో వాచ్, 75 టీషర్టులు ఉంటాయి.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న సీపీ చౌహాన్

భువనగిరి : అనారోగ్యంతో మృతిచెందిన భువనగిరి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్‌రావు కుటుంబ సభ్యులకు గురువారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ డీఎస్ చౌహాన్ రూ. 7,77,058ల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడారు. మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి త్వరగా పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలువేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో సీడీపీఏ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె జాని, నాయకులు శ్రీనయ్య, నర్సింహారావు, సమ్మయ్య, సతీష్, మహేందర్, మల్లేశం, ప్రసాద్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



జీవరత్నం మృతదేహం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): విద్యుదాఘాతంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. తిరుమలగిరి మండలం అల్వాల గ్రామశివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన కొండేటి జీవరత్నం(40) హిటాచ్చి(జేసీబీ చైన్ బండి) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పెద్దవూర మండలం చలకూర్తి గ్రామశివారులో పనిచేసుకొని తిరిగి నాగార్జునసాగర్ ఎడమ కాలు కట్ట మట్టి రోడ్డు వెంట లారీపై హిటాచ్చిని తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో అల్వాల ఆర్ 1 లిఫ్ట్ వద్ద 11కేవీ విద్యుత్ వైరు లారీపై ఉన్న హిటాచ్చికి తాకడంతో అందులో ఉన్న జీవరత్నం విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సంఘటన స్థలం వద్దకు వచ్చి పోలీసులకు సమాచారం అదించారు. ఎస్‌ఐ సురేష్ తన సిబ్బందిని తీసుకొని సంఘటన స్థలానికి చేరుకొని జీవరత్నంను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


పురుగుల అన్నం వద్దంటూ..

- హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

హాలియా : మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం వడ్డించారని ఆరోపిస్తూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం హాలియాలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 350 మంది విద్యార్థులు ఉండగా ప్రతి రోజు 250 మంది దాక మధ్యాహ్న భోజనం తింటున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం వడ్డించిన భోజనంలో పురుగులు కనిపించడంతో ఈ అన్నం మేము తినలేమంటూ ఒక్కరిగా విద్యార్థులంతా కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ప్లేట్లతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు మార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యార్థుల సమస్యను పట్టించుకునే దాక ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వారి



అన్నంలో వచ్చిన పురుగులు

సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల వద్దకు వెళ్లి ఆయన మధ్యాహ్నం భోజనం వడ్డించిన బియ్యాన్ని పరిశీలించారు. అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పురుగులు పట్టిన బియ్యాన్ని విద్యార్థులకు వడ్డించ వద్దని వెంటనే ఆ బియ్యాన్ని తిరిగి పంపించాలని డిప్యూటీ తహసీల్దార్ పాఠశాల ఏజెన్సీకి సూచించారు. ఇదే విషయంపై పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా ఎక్కువ కాలం బియ్యం నిల్వ ఉండడం కారణంగా బూజు పట్టాయని, వాటిని ఎప్పటికప్పుడు కడిగి శుభ్రం చేశాకే మధ్యాహ్న భోజన నిర్వాహకులు అన్నం వండుతున్నారన్నారు. ఈ రోజు మాత్రమే విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్నభోజనంలో పురుగులు వచ్చాయని, ఇక నుంచి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగయ్య (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండల పరిధిలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండానాగయ్య(38) పేయింటర్‌గా పనిచేస్తున్నాడు.16ఏళ్ల క్రితం గోపాలపురానికి చెందిన సిద్దెల భిక్షం కుమార్తె రేణుకతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు కుమార్తె సంతానం.ఈ క్రమంలో నాగయ్య భార్య ఇద్దరు పిల్లలతో స్వగ్రామమైన సింగారెడ్డి పాలెంనుంచి ఈనెల 14న కోదాడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు.అదే రోజు సాయంత్రం అత్తగారిల్లైన హుజూర్‌నగర్ మండలం గోపాలపురానికి చేరుకున్నారు.

ఇటుక బట్టీల సమీపంలో విగతజీవుడిగా..

మరుసటి రోజు 15వ తేదీన తెల్లవారుజామునే నాగయ్య గోపాలపురం నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. నాగయ్య ఇంటికి చేరిన తెలుసుకునేందుకు మామ భిక్షం అల్లుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువుల ద్వారా నాగయ్య ఇంటికి చేరలేదనే విషయం తెలుసుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే గురువారం గోపాలపురంలో సమీపంలో రోడ్డు పక్కన ఇటుక బట్టీల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం నాగయ్యదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి మామ భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

దైవదర్శనం చేసుకొని వస్తూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన జంగిలి రాకేష్, తన భార్య లిఖిత (20), తల్లి అలువేలుతో కలిసి బుధవారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిద్ర చేశారు. గురువారం ఉదయం దైవ దర్శనం చేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల పరిధిలోని గ్రీన్‌సిటీ వెంచర్ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న లిఖిత (20)తో పాటు భర్త, అత్తకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లిఖితను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి



లిఖిత (ఫైల్)

ఆవుల ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

బైకు పైనుంచి జారిపడి మహిళ ..

చౌటుప్పల్ : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన రుద్రాల కవిత(39) జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పని చేస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి అంబర్‌పేటలో నివాసం ఉంటోంది. తెలిసిన వ్యక్తితో కలిసి బైకుపై నార్కట్‌పల్లి నుంచి అంబర్‌పేటకు వెళ్తుండగా దండుమల్కాపురం గ్రామపంచాయతీ మధిర బొర్రోళ్లగూడెం స్టేజీ వద్ద హైవేపై ప్రమాదవశాత్తు జారి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. సూర్యాపేట పట్టణానికి చెందిన నల్లగట్టు ఆనంద్(20) గురువారం ఉదయం తన బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నకిరేకల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ఆస్తమా వ్యాధి నివారణకు కృషి



రీసెర్చ్ మద్దతు పత్రాన్ని పరిశోధన వైద్యుడికి అందజేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్

బీబీనగర్: ఆస్తమా వ్యాధి నివారణకు కృషి చేయనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. ఆస్తామా వ్యాధిపై పరిశోధన చేసేందుకు డీబీటీ ఇండియా నుంచి ఎయిమ్స్ వైద్యులకు రీసెర్చ్ గ్రాంట్ ద్వారా మద్దతు లభించిన సందర్భంగా ఆయన గురువారం ఎయిమ్స్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలోని 30మిలియన్లకు పైగా ప్రజలు ఉబ్బసం కలిగివున్నారని, వారిలో 70శాతం మందికి మాత్రమే రోగ నిర్ధారణ ఉందని తెలిపారు. సమావేశంలో వైద్యులు రోహిత్ సలూజా, హిమాద్రిసింగ్, అలేక్షఖురానా, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ అడుగులు.. చిరుతవి కావు

- అటవీశాఖ రేంజ్ అధికారి బాబిరెడ్డి

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని నడికూడ గ్రామంలో కనిపించిన అడుగులు చిరుతపులివి కావని నిర్ధారించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాబిరెడ్డి తెలిపారు. పులి గోర్ల ముద్రలు లేవని అడుగులు అడవికుక్క లేదా హైనావి అయి ఉండవచ్చునని తెలిపారు. హైనాలతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, మేకలు, గొర్రెల మీద దాడి చేసి తింటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఆహారం కొరకు ఎలాంటి జంతువు బలి అయినట్లు సమాచారం లేనందున అడవి కుక్క కావొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు భయాందోళనకు గురికావద్దన్నారు.

మెడికల్ షాపులో నగదు చోరీ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారు. ఆలేరు పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మజా మెడికల్ షాపును యజమాని సారాబు సంతోష్ రాత్రి 9 గంటలకు మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు షటర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ. 95 వేల నగదును ఎత్తికెళ్లారు. పక్కన ఉన్న మరో సాయి కృష్ణ కమ్యూనికేషన్ షాపులో చోరీకి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

గడ్డి మందు తాగిన యువతి మృతి

మోతె : కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గుండారపు సైదులు, నాగమ్మ దంపతుల కుమార్తె వినితకు మూడు నెలల కిత్రం మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన నిమ్మల మల్లయ్యలక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్‌తో వివాహం జరిగింది. వినిత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మనస్తాపం చెందిన వినిత ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సూర్యాపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల పరిధిలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పదేళ్ల బాలురు రాముడు, లక్ష్మణుడు గురువారం అదృశ్యమయ్యారు.ఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన మంగమ్మ తులసిరాం దంపతులకు రాముడు, లక్ష్మణుడు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం క్రితం తండ్రి చనిపోగా తల్లి మంగమ్మ మరొకరిని వివాహం చేసుకుని వెళ్లింది. అప్పటి నుంచి పిల్లలను గుడుగుంట్లపాలెంలోని మేమామ వీరబాబు పెంచుతున్నాడు. గురువారం ఉదయం స్కూల్‌బ్యాగులు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన బాలురు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వీరబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

బెల్లం, సారా పట్టివేత



పట్టుబడిన బెల్లం, సారా, కారుతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్ : ఎక్సైజ్ అధికారులు జరిపిన వాహన తనఖీల్లో 400 కేజీల బెల్లం, 10 లీటర్ల సారా, కారును స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ శివారులోని ఎన్నెస్పీ కాలువ వద్ద ఎక్సైజ్ సిబ్బంది గురువారం తెల్లవారుజామున వాహన తనఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న కారును ఆపారు. వెంటనే కారు నడుపుతున్న మాళోతు నర్సింహ వాహనాన్ని వదిలి పారిపోయాడు. కారును సోదా చేయగా 400 కేజీల బెల్లం, 10 లీటర్ల సారా పట్టుబడింది. వాటితో పాటు కారును కూడా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అంతే కాకుండా మేళ్లచెరువు మండలం వెల్లటూరుకు చెందిన రౌతు సైదమ్మ ఇంట్లో 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో భారీగా అడ్మిషన్లు



200 సంఖ్య ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 200 వరకు అడ్మిషన్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఆయన పాఠశాలలో రెండు వందలు అడ్మిషన్లు వచ్చిన సందర్భంగా 200 ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి సంబరాలు నిర్వహించి మాట్లాడారు. నాణ్యమైన విద్య, క్రమ శిక్షణ, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న పౌష్టికాహారం, డిజిటల్ విద్య అమలు చేస్తున్నందున భారీ స్థాయిలో పాఠశాలలో విద్యార్థులు చేరినట్లు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల పెరుగుదలకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సకుమారీ, పద్మావతి, సైదులు, రషీద్‌ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ్మారావు, కళ్యాణి, భవానీ, రవి, కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్‌రావు, శ్రవంతి, లాలు, విజయలక్ష్మి, సరస్వతి ఉన్నారు.

ఇటు పోరాటం.. అటు మమకారం !



తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ సమ్మెలో పాల్గొనడానికి ఓ ఏఎన్‌ఎం తన చంటి బిడ్డతో వచ్చింది. ఆమె తన బిడ్డను అక్కడే లాలించి పడుకోబెట్టి ఆందోళనలో పాల్గొంది.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మహిళా కోర్టు జడ్జి తిరుపతి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... మర్రిగూడ మండలం సరంపేటకు చెందిన యువతి అమ్మమ్మ గ్రామమైన సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాంలో ఉంటోంది. రోజు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుంది. కూలి పనికి వెళ్తున్న క్రమంలో నారాయణపురం మండలం వాయిలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుండెపంగ నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గయువతికి మాయ మాటలు చెప్పాడు. పలు సార్లు శారీరకంగా లోబర్చుకున్నాడు. 2017 మే 23న పుట్టినరోజు సందర్భంగా యువతిని సర్ల మైసమ్మ గుడికి తీసుకెళ్లాడు. గుడి సమీపంలో యువతిపై లైంగిక దాడి చేశాడు. యువతి వివాహం చేసుకోమని నరేష్‌ను నిలదీయగా నిరాకరించారు. పెద్ద మనుషుల సమక్షంలో కోరినా నరేష్ తిరస్కరించాడు. దీంతో యువతి 2017 మే 25న నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ పార్థసారథి, ఎస్‌ఐ మల్లీశ్వరి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి తిరుపతి అత్యారానికి పాల్పడినందుకు గాను సెక్షన్ 376 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ, కోదాడలో జరిగిన ఈ ఘటనల వివరాలు ఇలా.. మిర్యాలగూడ పట్టణం నాగార్జుననగర్ కాలనీలో నివాసముంటున్న రాగిరెడ్డి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం పాలు పోయడానికి వచ్చిన వ్యక్తికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో యజమాని జగ్గారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో పట్టణానికి వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందర చేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.దుండగులు 6 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు గురించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయన కాలనీలో నివాసం ఉండే గొట్టిపర్తి రమణమ్మ ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉంటోంది. ఇంట్లో నివాసం ఉండే ఆమె చిన్న కుమారుడు సతీష్ ఈ నెల 8న విియవాడకు వెళ్లాడు. 12న ఆమె పెద్దకుమారుడు ఇంటికి వచ్చి చూసేవరకు తాళం పగలకొట్టి బీరువా తీసి సామగ్రి చిందరవందరగా పడి ఉంది. విషయాన్ని తల్లి, సోదరుడికి తెలపగా వారు వచ్చి చూసే వరకు బీరువాలో ఉన్న 17.9 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కట్టంగూర్ : జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో గురువారం ప్రమాదవశాత్తు పెట్రోలు ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ అయిటిపాముల గ్రామ సమీపంలోకి రాగానే ఆకస్మాత్తుగా ఆగిపోయింది. అదే సమయంలో హైదరాబాదు నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సు ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 16 మంది ప్రయాణికులకు ఏలాంటి ప్రమాదం జరగపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ వెనక భాగం పగిలిపోవటంతో విషయం తెలుసుకున్న హిందుస్థాన్ పెట్రోలు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వేరే ట్యాంకర్‌లోకి పెట్రోలును షిఫ్ట్ చేసి తరలించారు.

ఆరోగ్యం కుదుట పడడం లేదని..

- పురుగుల మందు తాగి ఆత్మహత్య



నాగమ్మ మృతదేహం

మునుగోడు : ఎంతో మంది వైద్యుల వద్ద చికిత్స పొందినా ఆరోగ్యం కుదుట పడడం లేదని మనోవేదనతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మునుగోడు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన ఆడెపు నాగమ్మ(32) కొంతకాలంగా నోటికంతి బాధపడుతోంది. ఐదు సార్లు శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నా ఫలితం కనిపించలేదు. ఇక తనకు వివాహం కూడా కాదని తీవ్ర మనస్తాపం చెందిన నాగమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టు పక్కలవారు ఆమెను మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దేవరకొండ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. దేవరకొండ పట్టణానికి చెందిన గౌని వేణునాథంగౌడ్ (23) రెండు రోజుల క్రితం ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు అతడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శివరాం గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగభూషణంరావు తెలిపారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి



నందిపాడులో పంటలను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ మండలంలోని నందిపాడులో ఎండిపోతున్న పంటలను గురువారం రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో కొంతమంది రైతులు నాట్లు వేసుకుని ఉన్నారని, వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భజలాలు సైతం ఎండిపోయాయని తెలిపారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, మండల కార్యదర్శి రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పతాని శ్రీను, భిక్షం, మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవరంలో హీరో శ్రీకాంత్ దంపతుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న హీరో శ్రీకాంత్, ఊహ దంపతులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలోగల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీ నృషింహ స్వామి ఆలయాన్ని సినీ హీరో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం , ప్రధాన అర్చకులు ఇనుపకుతికెల లక్ష్మీనరసింహ మూర్తిలు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హీరో శ్రీకాంత్‌తో పాటు భార్య ఊహ, కుమారుడు రోషన్‌తో కుటుంబ సమేతంగా ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవవంతుగా సహకారం అందిస్తానని హీరో శ్రీకాంత్ తెలిపారు. అక్కడకు వచ్చిన భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. అనంతరం ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహమూర్తి నివాసానికి వెళ్లి సేదదీరారు.

యాదాద్రిలో హరి నామ సంకీర్తన



హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో గురువారం హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రారంభించారు. స్వామివారికి సంకీర్తన అత్యంత ప్రీతికరమని, నవ విధ భక్తి మార్గాల్లో సంకీర్తన మోక్షానికి అత్యంత దగ్గరి మార్గమని భావించిన అధికారులు ఆలయ ప్రాకార మండపంలో హైదరాబాద్‌కు చెందిన హరినామ సంకీర్తన భక్త భజన సంకీర్తన ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, స్థానిక భజన మండలి వారిచే హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా భజన మండలి కళాకారులు హరినామ సంకీర్తన చేశారు. యాదాద్రి ఆలయంలో ప్రప్రథమంగా ఈ హరినామ సంకీర్తనను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల పాటు ఈ హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు ఈ హరినామ సంకీర్తనలో పాల్గొని తన్మయత్వం పొందారు. అంతకు ముందు కళాకారులు జయ నారసింహ జై.. ఉగ్ర నారసింహ..లక్ష్మీ నారసింహ జై అంటూ హరినామ సంకీర్తన చేశారు.